## క్లుప్తంగా

### నేడు క్షయ నిర్ధారణ శిబిరం

మాడుగులపల్లి : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు (గురువారం) క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి సంజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమానితులు హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. రెండు వారాలకు మించి విడవని దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

### బీజేపీ వెంటే నిరుద్యోగులు

మిర్యాలగూడ టౌన్: నిరుద్యోగ యువత అంతా బీజేపీ వెంటే ఉన్నారని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ సంఘటన మంత్రి మధుకరన్ అన్నారు. మంగళవారం స్థానిక బృందావన గార్డెన్‌లో నిర్వహించి ఆ పార్టీ అనుబంధ శక్తి కేంద్రాలు, బూత్ కమిటీల వర్క్‌షాపులో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు పులి విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణావత్ రతన్ సింగ్ నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సత్యప్రసాద్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు చలమల సీతారాంరెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహాసభ కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ : ఈనెల 18న హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభ ప్రచార కరపత్రాలను బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో జిల్లా నాయకులు సందాల శంభయ్య, మధులు ఆవిష్కరించి మాట్లాడారు. బహిరంగ సభ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న మిర్యాలగూడలో నిర్వహించనున్న సమావేశానికి మందకృష్ణమాదిగ హాజరుకానున్న నేపథ్యంలో మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి ఉదయకుమార్, ఆకారపు గోపాల్, పరంగి సురేష్, కోట రాజు, మధు, చంద్రబాబు, సందీప్, క్రాంతి, సూర్య, పవన్ పాల్గొన్నారు.

### కారు ఢీకొని దూడ మృతి

మాడుగులపల్లి : కారు అదుపుతప్పి గేదె దూడను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై కుక్కడం శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివి.. కుక్కడం రైస్‌మిల్లు సమీపంలో గేదెలు రహదారి డివైడర్ దాటుతుండగా వాహనాల శబ్దానికి బెదిరి ఒక్కసారిగా వెనక్కి తిరిగి పరుగెత్తాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి దూడను ఢీ కొట్టింది. కారు ఢీ కొన్న వేగానికి దూడ ఎగిరి బానెట్‌పై పడి మృతి చెందగా.. కారు ముందుభాగం ధ్వంసమైంది. కారు వెనుక నుంచి వస్తున్న డీసీఎం డ్రైవర్ అప్రమత్తతతో బ్రేక్ వేయడంతో ప్రాణనష్టం తప్పింది.

### కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా జీడయ్యయాదవ్

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా దామరచర్ల మండలానికి చెందిన పగిడి జీడయ్యయాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగంలో చేసిన పనిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### పోలీస్ సెక్యూరిటీ గదుల ఏర్పాటు పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ సెక్యూరిటీ రూమ్‌లను డీఏఓ రాధతో కలిసి డీఎస్పీ వెంకటగిరిలు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటగిరి మాట్లాడుతూ అనంతరం సెక్యూరిటీ గదుల ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఇండియన్ టిబెటిన్ బార్డర్ పోలీస్ అధికారి అభిమన్యు, తహసీల్దార్ హరిబాబులతో పాటు నాయకులు ఉన్నారు.

### కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

పెద్దవూర : బీఆర్ఎస్ పార్టీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తకోట ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి మునిరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎస్కే బషీర్, సర్పంచ్ లింగయ్య, నాయకులు అబ్బాస్, నరేందర్‌రెడ్డి, శ్రీకర్, బాలాజీనాయక్, శ్రీరాములు, శంకర్‌నాయక్, వినోద్, కృష్ణ, బాలవర్ధిరాజు, శ్రీనివాస్‌చారి, రాము పాల్గొన్నారు.

# బారికేడ్ల ఏర్పాటుతో ఇబ్బందులు



పోలీస్ స్టేషన్ నుంచి ఎన్నెస్పీ క్యాంపు వైపు వెళ్లే దారి మూయడంతో బారికేడ్లపై నుంచి దూకి వెళ్తున్న విద్యార్థులు



నిడమనూరులో ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసి బారికేడ్ల నుంచి దూరి వెళ్తున్న మహిళ

- నిడమనూరు ఆర్‌ఓ కార్యాలయం వద్ద దారులు మూసివేత
- చుట్టూ తిరిగి వెళ్తున్న ప్రజలు
- ప్రతీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇదే పరిస్థితి

నిడమనూరు : ప్రతీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిడమనూరు మండల కేంద్ర వాసులకు ఇబ్బందులు తప్పేటట్లు లేవు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా మార్చడం సంతోషంగానే ఉన్నా రహదారిని బారికేడ్లతో మూసివేశారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నవంబర్ 3తేదీ నుంచి ఇక్కడే సాగర్ నియోజకవర్గానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. దానికి సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా పోలీస్ స్టేషన్ నుంచి, కోర్టు ముందు నుంచి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు వీలుగా అప్పుడే కర్రలతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ ముందు నుంచి ఉన్న దారి మండల కేంద్రంలోని ఎన్ఎస్పీ క్యాంపునకు, జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పీహెచ్‌సీలకు వెళ్లే వారు ఇక్కడి నుంచే వెళ్లేవారు. దారికి అడ్డంగా కర్రలు పాతడడంతో వేరే దారి గుండా వందలాది మంది చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. కొంత మంది చుట్టూ తిరిగి వెళ్లలేక కర్రల కిందనుంచి దూరి, పిల్లలు అయితే వాటికి ఎక్కి దూకి వెళ్తున్నారు. నామినేషన్లకు ముందు రోజు నుంచి దారిని మూసివేసినా బాగుండేంది. ఐదు రోజుల ముందు నుంచే మూసేయడం వల్ల స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## హాలియా కళాశాలలో డీఐఈఓ విచారణ

హాలియా : హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రిన్స్‌పాల్ తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నంటూ అదే కళాశాలకు చెందిన ఓ మహిళా లెక్చరర్ ఇటీవల ఇంటర్ బోర్డు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. మహిళా లెక్చరర్ ఇచ్చిన ఫిర్యాదుకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం హన్మకొండ డీఐఈఓ గోపాల్ హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విచారణ చేశారు. విచారణ అధికారికిగా వచ్చిన డీఐఈఓ గోపాల్ కళాశాలలోని లెక్చరర్లు, విద్యార్థులు, ఫిర్యాదు చేసిన మహిళా లెక్చరర్‌కు కొన్ని ప్రశ్నలతో కూడిన పత్రాలను అందించి వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. విచారణలో చేపట్టిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రిన్స్‌పాల్ తనను లైంగికంగా వేధిస్తున్నారని మహిళా లెక్చరర్ ఈనెల 29న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైనట్లు తెలిసింది.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**డీఐఈఓకి వినతి**

మహిళా లెక్చరర్‌ను వేధింపులకు గురి చేస్తున్న ప్రిన్స్‌పాల్‌ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, ఐద్వా నాయకురాలు కారంపూడి ధనమ్మతో పాటు సంఘం నాయకులు డీఐఈఓ గోపాల్‌కి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రిన్స్‌పాల్‌ను విధుల నుంచి తొలగించాలని సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని డీఐఈఓకు అందజేశారు.

## ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

నిడమనూరు: ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వరిస్తున్న ప్రతీ ఉద్యోగి నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన ఉండాలని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం అసెంబ్లీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించి 'మీరు ఏవిధంగా సహాయపడుతారో తెలిపమని ఆ డెస్క్ అధికారులను అడిగారు. దీంతో వారు తాము ఎన్నికల అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు ఇస్తామని తెలిపారు. పత్రాల్లో ఎన్ని సంతకాలు పెట్టాలి, ఎలా పూరించాలి అంటూ ఆర్‌ఓ మళ్లీ ప్రశ్నించారు. అక్కడున్న వారు సమాధానం చెప్పలేకపోయారు. దీంతో మీకే వివరాలు తెలియకపోతే అభ్యర్థులకు ఎం చెబుతారని ప్రశ్నించారు. హెల్ప్ డెస్క్ వద్ద ఉండే వారికి మరింత శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

**ఎన్నికల అధికారులకు సహకరించాలి**

ఎన్నికల అధికారులకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. నిడమనూరులో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ మల్లికార్జున్, వివిధ పార్టీల నాయకులు కొండేటి శ్రీను, చంద్ర శేఖర రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిడమనూరు : హెల్ప్‌డెస్క్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాస్

## సాగర్ ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్‌గా సామేల్ జాన్

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) అడిషనల్ కమాండెంట్ బ్రహ్మచారి దామరచర్ల మండలంలో నూతన నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామగుండం నుంచి బదిలీపై వచ్చిన అడిషనల్ కమాండెంట్ సామేల్ జాన్ బుధవారం విధుల్లో చేరారు. ఆయనకు నాగార్జునసాగర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్పీఎఫ్ ఉద్యోగులతో పాటు డ్యాం ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, జెన్‌కో రక్షణ దళం ఆర్ఐ ఈశ్వర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న బ్రహ్మచారిని సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.



సామేల్‌జాన్, బ్రహ్మచారిని సన్మానిస్తున్న ఎస్పీఎఫ్ అధికారులు

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



నిడమనూరు : ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పూర్తయిన ఏర్పాట్లు

మిర్యాలగూడ : ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు గాను ఈనెల 3 నుంచి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచే పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందుకుగాను నియోజకవర్గంలోని రెవెన్యూ కార్యాలయాన్ని రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా ఏర్పాటు చేశారు. నామినేషన్లను స్వీకరించే ఆర్‌ఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. బారీకేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను దారి మళ్లిస్తున్నారు. కేంద్రాల వద్ద ఉన్న కొన్ని మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులతోపాటు సీఆర్‌పీఎఫ్ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

నిడమనూరు : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు నిడమనూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్‌గా మార్చారు. ఈనెల 3వ తేదీ నుంచి నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అవుతుండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యలయం వద్ద హెల్ప్ డెస్క్, సువిధ, అకౌంటింగ్ విభాగాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యాలయం నుంచి వంద మీటర్ల వరకు రాకపోకలను నియంత్రించారు. ఇందు కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి కార్యాలయంలో పచ్చని తివాచీలు పరిచారు. సీసీ కెమెరాల ఏర్పాటు, నామినేషన్ పత్రాలను ఇవ్వడంతో పాటు అభ్యర్థులకు తెలియని విషయాలపై అవగాహన కల్పించడం కోసం మగ్గురు అధికారులతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలో నవంబర్ 3నుంచి రాజకీయ పార్టీల అభ్యర్థులతో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం హెల్ప్ డెస్క్, సీ విజిల్, మానిటరింగ్ రూమ్ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన విధివిధానాలను అధికారులు రాజకీయ పార్టీల నాయకులకు పలుమార్లు సమావేశాలు నిర్వహించి తెలియజేశారు.

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమలగిరి మండలంలోని జమ్మలకోట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రమావత్ రాముడు వడిత్య హరియా, జటావత్ సక్రు, రమావత్ చిరంజీవి, చిట్టిబాబు, జానకిరాం, మహేష్, రమేష్, లాలు, తులసిరాం, అంజినాయక్, పాండు, సుమన్, దత్తు, మట్టిపల్లి రమేష్, రాము, అశోక్‌కుమార్‌తో పాటు మరికొంత మంది ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సత్యం, ఉప సర్పంచ్ బొల్లిగొర్ల కాశయ్య, హేమనాయక్ తదితరులు ఉన్నారు.

## అన్నా చెల్లెలుకు డాక్టరేట్

హాలియా: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఒకే కుటుంబంలోని అన్నా, చెల్లెలు అయిన బాణావత్ బాలు, బాణావత్ శారదలు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన స్నాతకోత్సవంలో సీఈఓ పద్మ శంతన్ నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్ చేతుల మీదుగా వీరు పీహెచ్‌డీ పట్టా స్వీకరించారు. బాణావత్ బాలు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో హిస్టారికల్ ప్రాస్పెక్టివ్ ప్రొ కబడ్డీ-ఏ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. బాణావత్ శారదకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య పర్యవేక్షణలో ములుగు జిల్లాలోని గిరిజనుల సంస్కృతి, చరిత్ర, సామాజిక, ఆర్థిక పరిస్థితులు అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. దీంతో నాయుడుపాలెం గ్రామంలో వారి తల్లిదండ్రులు బాణావత్ సక్రు, రాజీ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డాక్టరేట్ పొందిన అన్నాచెల్లులు బాలు, శారద



పీహెచ్‌డీ పట్టా అందుకున్న పుష్పలత

**ఉపాధ్యాయురాలు పుష్పలతకు పీహెచ్‌డీ పట్టా**

గుర్రంపోడు : మండలంలోని కోయగూర వానిబావి గ్రామానికి చెందిన ముస్కు పుష్పలత ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందుకున్నారు. యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పర్యవేక్షణలో 'జిల్లా ఉపాధ్యాయ రచయితల సాహిత్యం, సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. పుష్పలత కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసి ఎన్‌జీ కళాశాలలో డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో పీజీ పూర్తి చేశారు. వివాహానంతరం బీఈడీ, పీజీ పూర్తి చేసి ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించిన పుష్పలత పీహెచ్‌డీ సాధించినందుకు పలువురు అభినందించారు. వట్టికోడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలైన పుష్పలతను మండల విద్యాధికారి తరి రాము, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

## కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలి

త్రిపురారం : గ్రామ స్థాయి నుంచి కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి సూచించారు. బుధవారం త్రిపురారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనుముల నర్సిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనంత రెడ్డిలు జనారెడ్డి సమక్షంలో అదే విధంగా అంజనపల్లి గ్రామానికి చెందిన పల్లపు సైదులు, శ్రీను ఆధ్వర్యంలో సాగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైవీర్‌రెడ్డి సమక్షంలో మండల కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జైవీర్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, గోపగని శ్రీనివాస్, ఉప సర్పంచ్ పీటీ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, వైస్ ఎంపీపీ మట్టయ్య, వెంకట్ రెడ్డి, ఆలంపల్లి జానయ్య,వీరయ్య, సలికంటి బాలకృష్ణ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హాలియా : కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన 30కుటుంబాలు బుధవారం జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోచేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో కుందూరు జానా రెడ్డి

**సాగర్ కాంగ్రెస్ అభ్యర్థి వాహనాలు తనిఖీ**

నాగార్జునసాగర్ : స్థానిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం ఆంధ్రానుంచి తెలంగాణకు వస్తున్న వాహనాలను సరిహద్దులో కొత్త వంతెన చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అటునుంచి వచ్చిన జైవీర్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు.

## ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ బిడ్డగా పనిచేస్తా

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రానున్న ఎన్నికల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే మీ బిడ్డగా పనిచేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తెట్టకుంట గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 35ఏళ్ల నియోజకవర్గాన్ని పరిపాలించిన జానారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని ఆమె విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

త్రిపురారం : మండల భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు నగిరి వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఎన్నుకున్నారు. త్రిపురారం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మాసారపు రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

## బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వెంకటమ్మ

మిర్యాలగూడ : పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సీనియర్ గణిత లెక్చరర్‌గా విధులు నిర్వరిస్తున్న వెంకటమ్మ నియామకమయ్యారు.ఈ మేరకు ఆక్టోబర్ 30న గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి కె.లక్ష్మయ్య ఉత్తర్వులను జారీ చేశారు. విద్యార్థుల ప్రవేశం కోసం అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్ శారదతోపాటు ఒప్పంద అధ్యాపకురాలు పుష్పని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బాలునాయక్

దేవరకొండ : బీఆర్ఎస్ దేవరకొండ పట్టణ అధ్యక్షుడు పున్న వెంకటేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జానారెడ్డి పున్న వెంకటేశ్‌కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని జానారెడ్డి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. పున్న వెంకటేశ్‌తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ కుమారుడు రూప్లానాయక్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గన్యానాయక్ తండా, ఏపూర్‌తండా, చెన్నారం తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ దేవరకొండ అభ్యర్థి బాలునాయక్ సమక్షంలో సుమారు వంద కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి.

## బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెత్తించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : పట్టణంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం హోరెత్తించాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలన్నింటిని ప్రతి గడపకూ వెళ్లి వివరించాలన్నారు. ఆయా వార్డుల్లో మహిళల కోలాటం, డప్పు కళాకారులతో ప్రచారం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున జనం తరలిరావడానికి కృషి చేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కార్పెంటర్స్ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.50వేలు విరాళం



పాండురంగారెడ్డిని సన్మానిస్తున్న కార్పెంటర్స్

హాలియా : మున్సిపాలిటీలోని విశ్వబ్రాహ్మణ కార్పెంటర్స్ యూనియన్ కమిటీ హాల్ నిర్మాణం కోసం బుధవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి రూ.50వేలు విరాళంగా అందించారు. ముందుగా పాండురంగారెడ్డి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పెంటర్స్ యూనియన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాత బుసిరెడ్డి పాండురంగారెడ్డి, తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాతోజు ఎల్లయ్యచారి నాగార్జున పరిపూర్ణచారి, శేఖరచారి, బ్రహ్మచారి, యాదగిరిచారి, సైదాచారి, కృష్ణచారి, మోహన్‌చారి, సాగర్ చారి, అంజయ్యాచారి, సత్యనారాయణ చారి, శ్రీనివాస చారి, మోహనచారి, ద్రోణచారి, నాగేండ్ల కృష్ణారెడ్డి, అఖిల్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, లింగస్వామి ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, పెండ్లిపాకల గ్రామాల్లో వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఏ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓలు సురేష్, అనంతలక్ష్మి, సీఈఓ తిరుపతిరెడ్డి, ఆఫీసర్ సైదులు, పాపిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దవూర : పండించిన వరి ధాన్యాన్ని రైతులు ఇంటి వద్దనే ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ సరోజ, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాళ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీదేవి, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఓ సందీప్, ఏపీఎం విజయ్‌కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

## ప్రజల్లో భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్

మాడుగులపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అభంగాపురం, గజలాపురం, గార్లకుంటపాలెం, చెరువుపల్లి గ్రామాల్లో బుధవారం సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరైనా అలజడి సృష్టించినా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ కుమార్, ఏఎస్ఐ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



చెరువుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

మాడుగులపల్లి : ట్రాక్టర్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గురప్పగూడెం స్టేజీ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామానికి చెందిన ముక్కాముల సైదులు (35) ధాన్యం విక్రయించేందుకు ఉదయం ట్రాక్టర్‌తో మిర్యాలగూడ వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మాడుగులపల్లి మండలం గురప్పగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు వెంట ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని వేములపల్లి పోలీసులు తెలిపారు.